# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  10-07-2026               సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలను ఉపేక్షంచబోమని మంత్రి కొలుసు పార్ధసారథి స్పష్టం చేశారు.

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఐ.ఎన్.ఎస్. మహేంద్రగిరి విశాఖపట్టణంలో రేపు జలప్రవేశం చేయనుంది.

- దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ పలు వాణిజ్య సంస్థల అధినేతలతో సమావేశమై రాష్ట్రంలో తమ యూనిట్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

- ఆతిధ్య రంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

========================

రాష్ట్రానికి ఆర్ధిక పరిపుష్టి ముఖ్యమని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి ఉద్ఘాటించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజానికి సోషల్ మీడియా ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించామని చెప్పారు. సోషల్ మీడియాలో కొందరు నైతిక విలువలను పాటించడం లేదని, ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంటున్నారని, అటువంటి వారిని ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్  ఏర్పాటు, సోషల్ మీడియా దుర్వినియోగం, మహిళలు, బాలికలపై సైబర్ వేధింపుల నివారణకు ప్రత్యేక స్టేట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు మొదలైన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అలాగే యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, జలవనరుల శాఖలకు సంబంధించి పలు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పార్ధసారధి పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

========================

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించబడిన అత్యాధునిక యుద్ధనౌక 17A స్టెల్త్ ఫ్రిగేట్ "మహేంద్రగిరి" ప్రారంభోత్సవంలో రేపు విశాఖలో పాల్గొననున్నట్టు సామాజిక మాధ్యమం పోస్టులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఆత్మనిర్భర భారత్ దార్శనికతకు, దేశీయ రక్షణ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల అద్భుతమైన సామర్థ్యాలకు ఇది ఒక నిదర్శనమని రక్షణ మంత్రి పేర్కొన్నారు. దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడడంతో పాటు ఇండో-పసిఫిక్ రక్షణ కోసం మనదేశ సంకల్పాన్ని బలోపేతం చేయడానికి ఐ.ఎన్.ఎస్. మహేంద్రగిరి సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

========================

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్.. డెల్టా ఎక్స్ దక్షిణ కొరియా వ్యవస్థాపకుడు, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో ఈరోజు సియోల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో ఇంగాట్‌లు, సోలార్-గ్రేడ్ సిలికాన్ వేఫర్‌లు, పీవీ సెల్‌లు, బ్యాటరీ సెల్‌లు, సోలార్ మాడ్యూళ్ల తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తోందని, ఆంధ్రప్రదేశ్ లో ఒక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (BESS) తయారీ యూనిట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన స్టీఫెన్ కిమ్.. యూనిట్ నిర్మాణంపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం కొరియా ఆటో ఇండస్ట్రీస్ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్, గ్లోబల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ నామ్ సూ పార్క్ తో సియోల్ లో జరిగిన సమావేశంలో.. రాష్ట్రంలోని 10 గిగా వాట్స్ డేటా-సెంటర్ పైప్‌లైన్ కేంద్రంగా డేటా సెంటర్లు, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌తో కూడిన పూర్తి AI-కంప్యూట్ స్టాక్ కోసం ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్ కేంద్రంగా మార్చాలని కోరారు. ఇన్వెస్ట్ కొరియా సంస్థ కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యుంగ్ తో సమావేశమైన మంత్రి లోకేశ్.. అమరావతి లేదా విశాఖపట్నంలో ఒక ప్రత్యేక కోట్రా, ఇన్వెస్ట్ కొరియా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

(వాయిస్ 23 సెకన్లు)

విరామం

========================

ఆతిథ్య రంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయవాడలో ఈరోజు సమావేశమై.. హాస్పిటాలిటీ రంగానికి జీఎస్టీ సంస్కరణలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్లపై 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. హాస్పిటాలిటీ రంగానికి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పునరుద్ధరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందించి.. రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

========================

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ నెల 17వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే అరవిందబాబు.. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాతో కలిసి కోడెల శివప్రసాద్ స్టేడియం ప్రాంగణాన్ని ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూలై 17న నరసరావుపేటలో నిర్వహించే క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలోనే సుమారు 1,500 కోట్ల రూపాయల రుణాలను వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. అదే విధంగా.. బ్యాంకుల కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమాలకు సంబంధించిన అనుమతి పత్రాలను కూడా అందజేయనున్నట్లు తెలిపారు.

========================

ఇటీవల గోవాలో జరిగిన 8వ బ్రాండీ ఫెడరేషన్ కప్ స్కేటింగ్ పోటీల్లో రాష్ట్రానికి రజిత పతకం సాధించిన సి.హెచ్.వి. దాక్షిణ్య.. ఈరోజు రాష్ట్ర యుజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి.. దాక్షిణ్యను అభినందించి, భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బిగ్ ఛాంపియన్స్ స్కేటింగ్ అకాడమీ కోచ్ షేక్ ఖాదర్ బాష మాట్లాడుతూ... దాక్షిణ్య.. పిన్న వయసులోనే స్కేటింగ్‌లో 35 కిలోమీటర్ల మేర ప్రదర్శన చేసి రెండు జాతీయ అవార్డులను సాధించడంతో పాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని తెలిపారు.

=======================

సీజనల్ జ్వరాలపై ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లాలోని గజపతినగరం నియోజకవర్గ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని.. జ్వరాలపై వస్తోన్న కథనాలతో ప్రజలు ఆందోళన చెందవద్దని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటికే వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నియోజకవర్గంలోని జ్వరాల దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు.

=======================

తిరుపతి పార్లమెంట్ పరిధిలో 4 కోట్ల 99 వేల రూపాయలతో గ్రామీణ రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం.గురుమూర్తి తెలిపారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 4 గ్రామీణ రహదారి పనులకు ఆమోదం లభించిందని ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 4.65 కిలోమీటర్ల పొడవున ఈ రహదారుల నిర్మాణం జరగనుందని, వీటి ద్వారా తీగపాలెం, మోపూరు, వానెల్లూరు, ముసిలిపేడు గ్రామాలకు మెరుగైన రవాణా అనుసంధానం కలగనుందని గురుమూర్తి తెలియజేశారు.

=======================

జిల్లాలోని నిరుద్యోగ యువతతో పాటు.. విశ్రాంత ఉద్యోగులను సైతం ప్రోత్సహించి, వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈరోజు జరిగిన.. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), ఎస్ఐపిబి ఇన్‌వెస్ట్‌మెంట్ ట్రాకర్, ఎంఎయుల ఆన్‌లైన్ సమావేశాల సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలా సహకారం అందించి, వీలైనంత త్వరగా పరిశ్రమలను స్థాపించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని, అందువల్ల వారి పెట్టుబడులను పారిశ్రామిక రంగం వైపు మరల్చాలని సూచించారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అలాగే ఎంబిఏ విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి.. వారు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే విధంగా చైతన్య పరచాలని కలెక్టర్ కోరారు.

=======================
=======================